క్లుప్తంగా

విశ్వేశ్వరస్వామి దేవస్థాన స్థలం స్వాధీనం



స్థలం స్వాధీనం చేసుకున్న దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు

దాబాగార్డెన్స్: నగరంలోని మెయిన్‌రోడ్డు సూర్యాబాగ్‌లో వేంచేసియున్న విశ్వేశ్వరస్వామి దేవాలయ హక్కు భుక్తం, టౌన్‌సర్వే నెంబరు 1665లో 78 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని ఏపీ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు సోమవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణకు సంబంధించి దేవస్థానం ఓపీ నెంబరు 1504/2010 ప్రకారం ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌లో కేసు ఫైల్ చేయగా, దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో ఆ స్థలంలో ఉన్న ఆక్రమణదారుడు దేవదాయ శాఖ జిల్లా అధికారిణి టి.అన్నపూర్ణ, ఆలయ మేనేజర్ ఎ.దేముళ్లకు ఖాళీ స్థలం అప్పగించారు. ఈ స్థలాన్ని టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా లీజుకిచ్చేందుకు తగు చర్యలు చేపట్టాలని దేవదాయ శాఖ జిల్లా అధికారిణి అన్నపూర్ణ మేనేజర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దుర్గాలమ్మ ఆలయ ఇవో శేఖర్‌బాబు, దేవదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి మూడు వినతులను జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి మూడు వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, ఏపీడీవో కృపానందం, పాల్గొన్నారు.

పీఠాధిపతి అప్పలాచార్య మృతి

జగదాంబ: ఆధ్యాత్మిక లోకంలో అద్భుత సేవలు అందించిన అప్పలాచార్య పీఠాధిపతులు సోమవారం స్వర్గస్తులయ్యారు. ఆయన మృతదేహాన్ని శిష్యులు, బంధువులు ఘనంగా పూజించి, అనంతరం సమాధి చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ నివాళులర్పించారు. అప్పలాచార్య పీఠాధిపతులు ఎంతో మంది భక్తులకు గురువుగా ఉంటూ, వారికి సరైన మార్గాలను చూపించారని ఆయన కొనియాడారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



షెడ్ ఏర్పాటు చేయాలని జెడ్సీని ఆదేశిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: అన్న క్యాంటీన్ల నిర్వహణ నిత్యం గమనించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే వారు ఎండ, వాన నుంచి రక్షణ పొందేలా క్యాంటీన్ ప్రాంగణంలో షెడ్ ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని జోన్-4 పరిధి కేజీహెచ్ సమీపాన ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం పరిశీలించారు. ఆహారం రుచిగా..వేడిగా అందిస్తున్నారా? అని అక్కడ ఆహారం భుజించే వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వేంకటేశ్వరరావు, సహాయక ఇంజినీర్ విల్సన్, ఏపీడీ పద్మావతి, టీపీఆర్‌వో రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిలకపేట శివాలయానికి రూ.55 వేల విరాళం



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాతలు

జగదాంబ : చిలకపేటలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర శివాలయానికి సోమవారం భక్తులు రూ.55 వేలు విరాళంగా అందజేశారు. జీవీఎంసీ 39వ వార్డుకు చెందిన చేపల రాము జ్ఞాపకార్థం రూ.25 వేలు, సూరాడ సత్తయ్య రూ.12 వేలు, స్వామి వివేకానంద సభ్యులు జ్ఞాపకార్థం రూ.18 వేలు విరాళంగా అందజేశారు. విరాళాలు అందించిన వారంతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, చేపల మసేన్, సూరాడ దానమ్మ, నక్క అప్పారావు, కృష్ణ, అప్పలకొండ పాల్గొన్నారు.



రెచ్చిపోతున్న ఈవ్‌టీజర్లు



కళాశాల విడిచే వేళ..బిక్కుబిక్కుమంటున్న విద్యార్థినులు

పోలీసుల నిర్లక్ష్యం
ప్రకటనలకే పరిమితమైన చర్యలు

విద్యార్థినులకు నరకం
స్కూళ్లు, బస్‌స్టాపుల వద్ద నిత్యం వేధింపులు

పాఠశాలల వద్ద అసాంఘిక కార్యకలాపాలు
భద్రత ప్రశ్నార్థకం!

తల్లిదండ్రులకు కూడా తప్పని ఈవ్‌టీజర్ల ఆగడాలు
చదువులకూ ఆటంకం

అధికారులు కళ్లు తెరుస్తారా?
సమస్య ముదిరే వరకు వేచి చూస్తారా?

దాబాగార్డెన్స్: నగరం మరోసారి ఆకతాయిల అరాచకాలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ముఖ్యంగా స్కూళ్లు, కళాశాలలు, బస్‌స్టాపుల వద్ద ఈవ్‌టీజర్ల మితిమీరిన ప్రవర్తనతో విద్యార్థినులు, యువతులు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పోలీసుల నిర్లక్ష్యం, అడపాదడపా చర్యలు మాత్రమే ఉండటంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాధితులు తమ గోడు చెప్పుకోలేక, నలుగురిలో నవ్వులపాలవుతామనే భయంతో మౌనంగానే రోదిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గ ప్రాంతంలో ఉన్న అనేక కళాశాలలు, పాఠశాలల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉదయం విద్యాసంస్థలకు వెళ్తున్నప్పుడు, సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్న సమయంలోనూ ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అమ్మాయిల వెంటపడి వేధించడం, మద్యం తాగి ఏడిపించడం, శృతిమించి ప్రవర్తించడం నిత్యకృత్యమైపోయింది. పాతజైల్‌రోడ్డులోని ప్రభుత్వ మహిళా కళాశాలకు వేల సంఖ్యలో విద్యార్థినులు వస్తుంటారు. కొంతమంది ఆకతాయిలు పాతజైల్‌రోడ్డు, డాబాగార్డెన్స్, ఎల్ఐసీ అంబేద్కర్ బస్‌స్టాప్, ఆర్టీసీ కాంప్లెక్స్ బస్‌స్టాప్‌ల వద్ద మాటు వేసి వారిని వేధిస్తున్నారు. ఇదంతా పోలీసులకు కనిపించడం లేదా? లేక చూసీచూడనట్టు వదిలేస్తున్నారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

విద్యార్థులే కాదు.. తల్లులకూ తప్పని వేధింపులు

ఈ ఆకతాయిల ఆగడాలు కేవలం విద్యార్థినులకే పరిమితం కావడం లేదు. తమ పిల్లల కోసం స్కూళ్లు/కళాశాలలకు వచ్చే తల్లులు కూడా వీరి వెకిలి చేష్టలకు గురికావాల్సి వస్తోంది. ఈవ్‌టీజర్ల ఆగడాలకు భయపడి కొంతమంది విద్యార్థినులు స్కూళ్లకు రావడానికి కూడా భయపడుతున్నారని చెబుతున్నారు. పిల్లల చదువులకే ఆటంకం కలిగించే ఈ పరిస్థితికి ఎవరు బాధ్యులు? నగరంలో మహిళల భద్రతకు పోలీసులు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే, ఈ సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది.



ఆర్టీసీ కాంప్లెక్స్ చందన బ్రదర్స్ బస్టాప్ వద్ద యువతీ యువకులు

నిఘా ఏర్పాటు చేయాలి



ఈవ్‌టీజింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలి. విద్యార్థినులను టార్గెట్ చేస్తూ చాలా మంది యువకులు కళాశాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బెడద తీవ్రంగా ఉంది. పోలీస్ ఉన్నతాధికారులు ఈవ్‌టీజింగ్‌పై చర్యలు చేపట్టాలి.

–రొబ్బా గంగా భవాని, పేరెంట్

స్కూళ్ల వద్ద అసాంఘిక కార్యకలాపాలు

ప్రభుత్వ స్కూళ్లకు సరైన రక్షణ చర్యలు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. సాయంత్రమైతే ఆకతాయిలు పాఠశాల ఆవరణలోనే తిష్ట వేసి, కొందరు మందుబాబులు మద్యం సేవిస్తూ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. పాఠశాలల వద్దే ఇలాంటి అరాచకాలు జరుగుతుంటే, విద్యార్థినులకు భద్రత ఎలా కలుగుతుంది? 'ఈవ్‌టీజర్లను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని పోలీసులు చెప్పే మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితికి, పోలీసుల ప్రకటనలకు పొంతన లేకపోవడం వారి వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోంది.

కళాశాల ఆవరణలో పిల్లలకు పూర్తి భద్రత



ఈవ్‌టీజింగ్‌లకు ఆస్కారం లేకుండా కళాశాల ఆవరణలో పిల్లలకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు సెక్యూరిటీ ఏర్పాటు చేశాం. ఇంకా ఎవరైనా మా విద్యార్థులను వేధిస్తున్నట్టు నా దృష్టికి వస్తే చర్యలు చేపడతాం. పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం.

డాక్టర్ ఆర్. మంజుల ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం..



నగరంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, అనుమానితులను గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా రౌడీషీటర్లు, ఈవ్‌టీజర్లపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి నిరంతరం కౌన్సెలింగ్ ఇస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నాం. మహిళల భద్రత కోసం 'శక్తి యాప్'పై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నాం. ఇది మహిళలకు రక్షణ కవచంగా నిలుస్తుంది.

–జీడీ బాబు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

చంద్రబాబు మోసాలపై విస్తృత ప్రచారం

అటకెక్కిన చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలు

- 14 ఏళ్ల అనుభవంతో 14 నెలల పాలన అంధకారం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్
- 27వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



బాబూ ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : 'వెన్నుపోటులో 14 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు పాలనతో, 14 నెలల కూటమి పాలనలో రాష్ట్రం మంట గలిసిందని' మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 27వ వార్డులో, వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వాసుపల్లి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలపై ప్రచారం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేకపోయారని ఆయన వివరించారు. చంద్రబాబును ఇంటికి పంపించే రోజులు సమీపంలోనే ఉన్నాయన్నారు.

ఓట్లేసి గెలిపించినందుకు పథకాలు ఆపేశారు

వార్డు పరిధిలోని సీరాపు వారి వీధిలో వాసుపల్లితో మాట్లాడిన ఒక స్థానిక మహిళ, తమ ఆవేదనను వ్యక్తం చేసింది. కరెంటు బిల్లులు అధిక యూనిట్లు చూపిస్తున్నారని, పథకాలన్నీ ఆపేశారని, కనీసం తన భర్తకు ఆటో ఆసరా కూడా నిలిచిపోయిందని ఆమె వాపోయింది. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తమకు అన్ని పథకాలు అందించారని, ఓట్లేసి గెలిపించినందుకు కూటమి ప్రభుత్వం తమకు పథకాలు లేకుండా చేశారని ఆమె మండిపడింది. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండు లక్షల కోట్లకు పైగా పేదలకు పథకాలు అందించిందని గుర్తు చేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, తప్పకుండా పేదలకు మంచి జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, ప్రస్తుత నిర్లక్ష్యాన్ని వాసుపల్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, కృష్ణకుమార్, పెద్దాడ రమణ, అంగటి కుమారి, మల్లేశ్వరి, రవణమ్మ, వెంకటలక్ష్మి, పిల్లి అజయ్‌రెడ్డి, మౌలీష్, రాము, గాంధీ, యేసు. పద్మనాభం రాజా, దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, ఆకుల శ్యామ్, కోరాడ సురేష్, నారాయణమూర్తి, తమ్మినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



సత్కారం పొందిన వారితో జగన్నాథ స్వామి దేవస్థానం ఈవో రాజగోపాలరెడ్డి తదితరులు

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన రథోత్సవాల్లో సేవలందించిన స్వచ్ఛంద సంస్థలను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఉత్సవాల్లో శ్రీ హరి సేవా సంఘం, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు అన్నదాన సేవతో పాటు ఆలయంలో జరిగిన వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. వారి నిస్వార్థ సేవలను గుర్తించిన దేవస్థానం కార్యనిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ అర్చకులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ హరి సేవా సంఘం అధ్యక్షుడు అప్పారావు, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



అర్జీ స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన 'రెడ్‌సెల్ సిస్టమ్' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు కోరారు. సోమవారం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. మొత్తం నాలుగు వినతులు స్వీకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, గ్రీవెన్స్ సెల్ ద్వారా అందిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వేంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

పీఎంఎఫ్‌బీవై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: రైతులకు వివిధ ఆర్థిక ప్రయోజనాలను అందించే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ, ఆగస్టు 15లోగా వరి పండించే రైతులు, కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ పథకంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. హెక్టారుకు రూ.1050, ఎకరానికి రూ.420 రైతులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రుణం తీసుకున్న రైతులకు 'ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ' ప్రీమియం చెల్లిస్తోందని గుర్తు చేశారు. ఈ పథకంలో చేరడం ద్వారా పంటకు బీమా పొందవచ్చని, రైతులు, కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లను సంప్రదించవచ్చు.

భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిధిలో వివిధ పార్కుల్లో తొలగించిన గార్డెన్ సొసైటీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సొసైటీలతో సంప్రదించకుండా అన్యాయంగా ఆరుగురు కార్మికులను 2024, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి విధుల నుంచి నిలిపివేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. 60 ఏళ్లు దాటిందన్న కారణంగా తొలగించినట్లు చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో పలు పార్కుల్లో 220 మంది పనిచేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వారాంతపు సెలవులు అమలు కావడం లేదని తెలిపారు. వీరిని తొలగించడంతో 9 నెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీరిని విధుల్లోకి తీసుకోవాలని, పనిచేసిన కాలానికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

42వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో సోమవారం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటించారు. వార్డులోని చాకలిపేట, ఎర్రగెడ్డ, కోళ్ల ఫామ్ బ్రిడ్జి, దొండపర్తి పరిసర ప్రాంతాల్లోని సమస్యలను స్థానికులను అడిగి ఆయన తెలుసుకున్నారు. చాకలిగెడ్డ ప్రాంతంలో వర్షపు నీరు అధికంగా చేరుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలియజేశారు. చాకలిగెడ్డలో గోడ నిర్మాణం వెంటనే చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ బి.రాము, వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కూటమి నాయకులు ఆకిరెడ్డి జగదీష్, నాగమణి, రమణ, గురుగోవింద్ సింగ్, మౌళి, కాశీప్రసాద్, ఈఈ, ఏఈ, శానిటేషన్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దేవద్దు..

టీచర్స్ రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులో నరసింహారావు నాయకత్వంలో సోమవారం మహిళలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ, వాటిని తిరస్కరించాలని స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. ప్రజల జేబులకు చిల్లు పెట్టి, విద్యుత్ చార్జీల భారం ప్రజల వేసి దోచుకునే ప్రయత్నమని పేర్కొన్నారు. సీఐటీయూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ఏ సమయంలో విద్యుత్ రేట్లు విపరీతంగా పెరుగుతాయో తెలియదని, తప్పనిసరిగా విద్యుత్ వాడాల్సిన పరిస్థితుల్లో అధిక రేట్లు పడతాయని తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఈ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ శిక్షణ కేంద్రం కొనసాగించాలి

దాబాగార్డెన్స్: నగరంలోని పాండురంగాపురం ఇండోర్ స్టేడియం జిమ్నాస్టిక్స్ స్పెషల్ బెడ్ శిక్షణా సౌకర్యాన్ని మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా మార్చాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా పిల్లల శారీరక అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన ఈ జిమ్నాస్టిక్స్ సెంటర్ అనేక మంది చిన్నారులకు శిక్షణనిచ్చి, జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి అథ్లెట్లను తయారు చేసిందని ఆమె గుర్తు చేశారు. ఇటువంటి ప్రత్యేక ఆట కోసం ఉన్న కేంద్రాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా మార్చడం ద్వారా దానికి అవసరమైన స్థలం ప్రాధాన్యత కుంటుపడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ప్రభుత్వ స్థలాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మించి, వాటిని ప్రభుత్వమే నిర్వహించి, ఉచితంగా అన్ని రకాల ఆటలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వేలాది మంది క్రీడాకారులు తయారవుతారని డాక్టర్ రమాప్రభ సూచించారు. విశాఖ నగర బాలల అవసరాల రీత్యా ఈ సెంటర్‌ను కేవలం జిమ్నాస్టిక్స్ కోసం మాత్రమే కొనసాగించేలా ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అధికారులు, కలెక్టర్‌ను ఆమె కోరారు. ఇప్పటికే నగరంలో స్పోర్ట్స్ ఎరేనాను ప్రైవేట్ వారికి అప్పగించి, సామాన్యులకు దూరం చేశారని ఆమె విమర్శించారు. పార్కులు, ఆట స్థలాలను ఆధునీకరణ చేసి విశాఖలో ఉన్న 4 లక్షల మంది చిన్నారులకు, యువజనులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. నగరంలో ప్రతి చిన్నారికి క్రీడలు హక్కుగా పొందే హక్కు ఉందని, వాటిని పరిరక్షించేందుకు బాలల హక్కుల సంస్థలతో కలిసి కృషి చేస్తామని డాక్టర్ రమాప్రభ స్పష్టం చేశారు.

భారత సంస్కృతిలో ప్రకృతి వైద్యం అంతర్భాగం



అన్నదానం ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: భారతీయ సంస్కృతిలో ప్రకృతి వైద్యం ఒక ముఖ్యమైన భాగమని, వేదకాలం నుంచే యోగా, ప్రకృతి వైద్యం ఆచారంలో ఉన్నాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్. సత్యనారాయణమూర్తి 83వ జయంతి సందర్భంగా సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, గాయత్రి వెల్ఫేర్ కల్చర్ యూత్ అకాడమీ సంయుక్త నిర్వహణలో ఏవీఎన్ కాలేజీ సమీపంలోని ప్రేమ సమాజం కుష్ఠు రోగుల ఆలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, ప్రకృతి వైద్యం ఇంటింటి వైద్యం లాంటిదేనని, ప్రతి నిత్యం దీనిని ఆచరించాలని సూచించారు. డాక్టర్ సత్యనారాయణమూర్తి సేవలను గుర్తించి 'లైఫ్ అచీవ్‌మెంట్' అవార్డుతో కేంద్ర ప్రభుత్వం సత్కరించిందని ఆమె గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, ఎస్. మహేష్, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాచపోలమాంబ తొలేళ్ల ఉత్సవం



అల్లిపురం మెయిన్ రోడ్డులో గల సతకం పట్టు వద్ద అమ్మవారిని ఊయలలూపుతున్న భక్తులు

అల్లిపురం:అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు గత నెల 24వ తేదీ నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరవీధిలోని అమ్మవారి పుట్టింటి నుంచి సాము గరిడీలు, నేల డ్యాన్సులతో తిరువీధిగా అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులోని అమ్మవారి సతకం పట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారిని ఊయలలో వేసి ఊపుతూ, పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. అక్కడి నుంచి అమ్మవారిని గోకుల్ థియేటర్ వరకు తీసుకెళ్లి, మహిళలు కలశాలతో నీటిని నింపి తిరువీధి నిర్వహించిన తర్వాత అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన పండుగ : శ్రీ రాచపోలమాంబ అమ్మవారి ప్రధాన పండుగ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముం'చెత్త'గా...



యార్డులో పేరుకుపోయిన చెత్తనిల్వలు

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని 35వ వార్డు, టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తతో పాతనగరం వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జోన్-3, 4, 5ల నుంచి రోజుకు టన్నులకొద్దీ చెత్త ఇక్కడికి వస్తుంది. అయితే ఈ నెల రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో చెత్త నిల్వలు భారీగా పేరుకుపోయాయి. దీనివల్ల దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, అంటువ్యాధుల భయంతో జీవిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి, యార్డుకు వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు క్లోజ్ కాంపాక్ట్ వాహనాల్లో కాపులుప్పాడ యార్డుకు తరలించాలి. కానీ పబ్లిక్ హెల్త్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల చెత్త యార్డు గేటు వరకు పేరుకుపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో అనేకసార్లు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేసినా, తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు. జనవాసాల మధ్య ఉన్న ఈ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని పాతనగరం వాసులు జీవీఎంసీ ఉన్నతాధికారులను కోరుతున్నారు. జీవీఎంసీ ఏఎంహెచ్‌వో కృష్ణంరాజును వివరణ అడగ్గా యార్డులో చెత్త కాపులప్పాడకు తరలించాల్సిన వాహనాలు గాజువాకలో జరుగుతున్న కాలువ పనులకు వెళ్లాయని, వీలైనంత త్వరగా చెత్తను తరలిస్తామన్నారు.